క్లుప్తంగా

వాహన డ్రైవర్ల సంఘం సలహాదారు నియామకం



అబ్దుల్ హమీద్

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర సలహాదారులుగా కర్నూలుకు చెందిన అబ్దుల్ హమీద్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారని, ఎంతో అనుభవం కలిగిన సీనియర్ నాయకుడిగా గుర్తించి రాష్ట్ర సంఘం సలహాదారులుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. తనను రాష్ట్ర సంఘం సలహాదారులుగా నియమించడం పట్ల సర్దార్ అబ్దుల్ హమీద్ హర్షం ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అభ్యున్నతికి, మరింత బలోపేతం చేసేందుకు అన్ని విధాలా సహకరిస్తానని పేర్కొన్నారు. ఈయన కర్నూలు ఆర్‌డబ్ల్యూఎస్‌లో ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రంజాన్ పండుగను పురస్కరించుకొని రద్దు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు గమనించాలని కోరారు. వచ్చే సోమవారం నుంచి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు.

వసతి గృహంలో షడ్రుచుల భోజనం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న వసతి గృహ సంక్షేమాధికారి బెన్నమ్మ

కర్నూలు(అర్బన్): విశ్వావసు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల నంబర్ -1 బాలికల వసతి గృహంలో ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఈ వసతి గృహంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తూ వసతి పొందుతున్నారు. వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న సంక్షేమాధికారిణి బి.బెన్నమ్మ మెనూ పాటించడంలోనూ, కుల మతాలకు అతీతంగా పండుగలకు ఇళ్లకు వెళ్లలేని విద్యార్థినులకు అంతకుమించిన షడ్రుచుల భోజనాలను అందించడంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా హాస్టల్‌లో దాదాపు 12 రకాల వంటకాలను తయారుచేసి విద్యార్థినులకు వడ్డించారు. ఉగాది పచ్చడి, భక్ష్యాలు, అన్నం, సాంబారు, వంకాయ కూర, చిత్రాన్నం, కారం చుట్టలు, పల్లీల చట్నీ, గారెలు, నూనెలో వేయించిన మిరపకాయలు, కర్డ్‌రైస్, అరటి పండ్లను వడ్డించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లోని వంట మనుషులతో కలిసి స్వతహాగా వంటకాలను తయారు చేయడంలో పాలుపంచుకోవడం విశేషం. అలాగే హాస్టల్ పరిసరాలను శుభ్రపరిచి కళ్లాపి చల్లి, రంగవల్లులను వేసి చూపరులను ఆకట్టుకునేలా హాస్టల్‌ను అందంగా అలంకరించారు.

ఉద్యోగుల సామాజిక సేవ అభినందనీయం



పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరపాలక ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమని కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. ఆదివారం స్థానిక 17వ శానిటేషన్ డివిజన్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో 42 మంది పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను బహుకరించారు. అలాగే చలివేంద్రం ప్రారంభించి ఆవరణలో మొక్కలు నాటారు.

శ్రీరామ కథా రసవాహిని ప్రారంభం



అలంకరణలో సీతారాములు

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్య సాయి బాబా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో వారం రోజుల పాటు నిర్వహించే శ్రీరామ కథా వాహిని కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ముందుగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించారు. పండితులు కేశవయ్య పంచాంగ శ్రవణం చేశారు. సాయి సేవా ట్రస్ట్ సభ్యులు, అధ్యాపకులు సూర్యనారాయణ శ్రీరామ కథా రస వాహినిని పరిచయం చేశారు. సభ్యులు సందీప్, అశోక్, పట్టాభి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది ఉషస్సు



పంచాంగ శ్రవణం చేస్తున్న కల్లె వేణుగోపాల్ శర్మ



ప్రత్యేక అలంకారంలో మహాగౌరి, గౌరీ శంకరుడు, లలితా పీఠంలో హనుమాన్

- భక్తిశ్రద్ధలతో వేడుకలు
- నూతన తెలుగు సంవత్సరం విశ్వావసుకు ఘన స్వాగతం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేసిన వేద పండితులు
- వృషభాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించిన అన్నదాతలు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరి

కర్నూలు కల్చరల్: షడ్రుచుల సమ్మేళనం ఉగాది వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలు సుంకులమ్మ, రేణుకా ఎల్లమ్మ, సవారమ్మ, మారెమ్మ, జంబుల మ్మ, తదితర జగన్మాతలకు చీరెలు, సారెలు, నైవే ద్యాలు సమర్పించారు. కోడి పుంజులు, పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయాలన్నీ సందడిగా మారాయి. షడ్రుచుల ఉగాది పచ్చడి తయారు చేసుకొని ఆరగించి ఇరుగు పొరు గువారికి వితరణ చేశారు. రైతులు వృషభాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగించారు. సాయంత్రం పొలాలకు వెళ్లి సేద్యం చేసి ఈ ఏడాది సాగును ప్రారంభించారు. ఆలయాల్లో వేద పండితులు, పురో హితులు పంచాంగ శ్రవణం చేశారు. నూతన తెలుగు సంవత్సరంలో సంభవించే లాభనష్టాలు, సుఖదుఃఖాలు, పంటలు, వర్షాల స్థితిగతులను వివరించారు. ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చిన్మయ మిషన్, ఇస్కాన్, లలితా పీఠం, రాజరాజేశ్వరీ దేవి ఆల యం, సూర్యనారాయణ స్వామి ఆలయం, సాయీశ్వరాలయం, సంకల్‌బాగ్ హరిహర క్షేత్రం, మానవత మహిళా విభాగం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. టీజీవీ కళాక్షేత్రంలో పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. కవి సమ్మేళనం ప్రత్యేకంగా నిలిచింది. సూర్యనారాయణ స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ విజయమనోహరి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



సాయీశ్వరాలయంలో..



ప్రత్యేక అలంకారంలో లలితా దేవి



లలితా పీఠంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



ఇస్కాన్ మందిరంలో..

కారుణ్య వర్షిణి.. రంజాన్

- నేడు ఈద్ -ఉల్- ఫిత్ర్
- కనిపించిన నెలవంక.. ముగిసిన ఉపవాసాలు
- సోమవారం ఈద్ నమాజ్ చేయనున్న ముస్లింలు
- జిల్లాలోని ఈద్గాలు, మసీదులు ముస్తాబు

కర్నూలు కల్చరల్: వరాల వసంతం, శుభాల సరోవరం రంజాన్ మాసం ముగిసింది. సర్వమానవాళికి కారుణ్య వర్షిణి అయిన రంజాన్ మాసం వేనవేల దైవానుగ్రహాలను ప్రపంచ మానవులకు పంచి పెట్టి వెనుదిరిగిపోయింది. ఈ మేరకు అన్ని మసీదుల్లో ఆదివారం సాయంత్రం మగ్‌రీబ్ నమాజ్ తరువాత నెల వంకను దర్శించుకున్న ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ ముబారక్ తెలుపుకున్నారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్ష ముగిసిన నేపథ్యంలో సోమవారం ఈద్ ఉల్ ఫిత్ర్ (రంజాన్) ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని ముస్లింలు రంజాన్ పర్వదినానికి సర్వం సిద్ధం చేసుకున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, బనగానపల్లె, ఆత్మకూరు, డోన్, నందికొట్కూరు, తదితర ప్రాంతాల్లో రంజాన్ సందడి అధికంగా ఉంటుంది.

రంజాన్ స్ఫూర్తి.. సేవా దీప్తి

రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్ష ఆచరించి అల్లాహ్‌ను మెప్పించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తారు. నెల రోజుల ఉపవాస దీక్షలో తరావీహ్ నమాజ్ చదివి సన్మార్గంలో నడిచిన ముస్లింలు శ్రమకు తగిన ప్రతిఫలాన్ని అల్లాహ్ నుంచి పొందే రోజే రంజాన్. జకాత్, ఫిత్రా, సదకాల పేరుతో సమాజంలోని అభాగ్యులను ఆదరించడంతో పాటు శాంతి సామరస్యాలను, సంతోషాన్ని పెంపొందింపజేయడమే ఈద్ ఉల్ ఫిత్ర్ అందించే సందేశం. పండగ స్ఫూర్తిని ముస్లింలు గుండెల నిండా నింపుకొని ఈ ఆనందంలో అందరినీ భాగస్వాములను చేసే ప్రయత్నం చేయాలని మత పెద్దలు సూచిస్తున్నారు.

ఈద్గాల వద్ద ప్రార్థన ప్రవక్త ఆజ్ఞ

ప్రతి ముస్లిం రంజాన్ పండుగ రోజున ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన చేయాలన్నది మహ్మద్ ప్రవక్త ఆజ్ఞ అని మౌలానాలు పేర్కొంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఈద్గా (వసతులు) లేనివారు తప్ప మిగిలిన ముస్లింలంతా ఈద్గా వద్దే నమాజ్ చేయాలి. ముస్లింలందరూ నూతన దుస్తులు ధరించి (వారి శక్తి కొలది శుభ్రమైన దుస్తులు ధరించి) ఒక చోటకు చేరి అక్కడి నుంచి తక్బీర్ చదువుతూ ఈద్గా వద్దకు చేరుకోవాలి. ఈద్గాలో జమాత్ సాత్ (అందరు ముస్లింలతో) నమాజ్ చేయడం వల్ల ఎంతో పుణ్యం దక్కుతుందని మౌల్వీలు పేర్కొంటున్నారు. ఈద్గా నమాజ్‌లో గరీబ్, అమీర్ (పేద, ధనిక) అనే తారతమ్యం లేకుండా అందరూ ఒకరి పక్కన మరొకరు వరుసగా నిల్చుని ప్రార్థన చేయడం వల్ల సమాజంలో అందరూ సమానమే అన్న భావన స్ఫురింపజేస్తుంది.

సూచికగా పేలిన ఔటు

రంజాన్ ఈదుల్ ఫితర్ పండుగ సూచికగా నిర్వాహకులు ఔటును పేల్చారు. సాధారణంగా రంజాన్ నెలలో నెలవంక దర్శనం సంద ర్భంగా మొదటి ఔటును కాల్చుతారు. ప్రతి రోజూ సహెర్, ఇఫ్తార్ వేళల్లో దీని శబ్దాన్నే ప్రమాణికంగా అనుసరిస్తారు. చివరగా శవ్వాల్ నెలవంక దర్శనం కనిపించాక ఈద్ సూచికగా ఔటును పేల్చడంతో పండగ రేపే అని ధ్రువీకరించుకుంటారు. రంజాన్ చివరి రోజా రాత్రి, ఈదుల్ ఫితర్‌ను పురస్కరించుకొని లైలతుల్ జాయిజా పేరుతో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ప్రార్థనలకు సిద్ధమైన రాజ్‌విహార్ సర్కిల్‌లోని మసీదు



ఈద్ నమాజ్‌కు సిద్ధం

ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా నిర్వహించే నమాజ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈద్గాలతో పాటు పలు మసీదుల్లో నిర్వాహకులు అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించారు. పండుగ రోజు అల్లాహ్‌కు కృతజ్ఞతా భావం వ్యక్తం చేసుకునేందుకు ముస్లింలు ఈద్గాలకు వెళ్లి రెండు రకాల ఈదుల్ ఫితర్ వాజిబ్ నమాజ్ చేస్తారు. నెల రోజుల తమ ఇబాదత్‌లు ఫలించాలని, సర్వమానవాళి సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ దువా చేస్తారు. నగరంలో ఈద్గాలతో పాటు ప్రకటించిన మసీదుల్లో కూడా ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ నిర్వహిస్తారు. పాత ఈద్గా, కొత్త ఈద్గా, గడ్డా అహెలే హదీస్ ఈద్గా, జొహరాపురం ఈద్గా, లతీఫ్ లవుబాలి, నిర్మల్‌నగర్ ఆయేషా మసీదులకు సంబంధించిన ఇమామ్‌లు ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ చేయిస్తారు. ఈద్ నమాజ్‌కు ముందే తప్పనిసరిగా ప్రతి కుటుంబ సభ్యుల (అప్పుడే పుట్టిన పసికందు అయినా సరే) పేరిట ఫిత్రా చెల్లించాల్సిన బాధ్యత అందరూ ముస్లింలపై ఉందని మౌల్వీలు అంటున్నారు. ఫిత్రా చెల్లించకపోతే ఉపవాసాలను అల్లాహ్ అంగీకరించరని పేర్కొంటున్నారు.

ఈద్ నమాజ్ వేళలు

లతీఫ్‌లవుబాలి మసీదులో	ఉదయం 6:35 గంటలకు
ఇంపీరియల్ గార్డెన్‌లో	ఉదయం 6:45
జొహరాపురం ఈద్గాలో	ఉదయం 6:45
గడ్డా ఈద్గాలో	ఉదయం 7:00
జీబీ మసీదులో	ఉదయం 7.00
అయేషా మసీదు (నిర్మల్‌నగర్)లో	ఉదయం 7.30
పోలీసు లైన్ మసీదులో	ఉదయం 8.00
ఖలీల్ హుస్సేన్ మసీదులో	ఉదయం 8.00
పాత ఈద్గాలో	ఉదయం 8:30
గఫూరియా మసీదులో	ఉదయం 8.30
ఇద్రీస్ మసీదులో	ఉదయం 8.30
కొత్త ఈద్గాలో	ఉదయం 9:00
రోజా దర్గా మసీదులో	ఉదయం 9:00
సలాంనగర్ మసీదులో	ఉదయం 9.00
జామియా మసీదులో	ఉదయం 9:30
మౌలా మిస్కీన్ మసీదులో	ఉదయం 9.30



డ్రైఫ్రూట్స్ విక్రయిస్తున్న మహిళ



టోపీల విక్రయం



రోడ్డుపై జనం రద్దీ

రంజాన్ సందడి

పాతబస్తీలో రంజాన్ సందడి నెలకొంది. సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మహిళలు సందడిగా షాపింగ్ చేశారు. ఆహార పదార్థాలు, దుస్తులు, ఇతర వస్తువులను కొనుగోలు చేయడంతో వన్ టౌన్ ఏరియా, చిన్నఅమ్మవారిశాలతో పాటు పలు ప్రాంతాల్లో జనం కిక్కిరిశారు. అడుగు తీసి వేయడానికి వీల్లేనంతగా సందడి కనిపించింది. వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



మహిళల అలంకరణ వస్తువుల కొనుగోళ్లు



గోరింటాకు కోన్‌లను కొనుగోలు చేస్తున్న దృశ్యం



అమ్మకానికి ఉంచిన గాజులు



సేమియా విక్రయిస్తున్న వ్యాపారి

నేటితో ముగియనున్న పన్ను వసూళ్ల గడువు

కర్నూలు (టౌన్): ఈనెల 31వ తేదీ నాటికి 2024–2025 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. పన్నులు చెల్లించేందుకు ఒక్క రోజు మాత్రమే అవకాశం ఉంది. గత డిసెంబర్ నుంచి పన్ను వసూళ్లపై నగరపాలక యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, రెవెన్యూ ఆఫీసర్లు, సిబ్బంది, సచివాలయాల సిబ్బందితో పాటు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సైతం ఉదయం 6.30 గంటల నుండే కాలనీలలో పర్యటించి పన్ను వసూళ్లు చేశారు. మొండి బకాయిల వసూళ్లకు టీంగా ఏర్పడి పన్నులను వసూలు చేశారు. ఆస్తి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సుల బకాయిలను వెంట పడి వసూలు చేశారు. రెండు రోజుల క్రితం 24 గంటల వ్యవధిలో రూ.2.40 కోట్లు వసూళ్లు చేశారు. ఇప్పటివరకు రూ.77 కోట్లు పన్నులు వసూళ్లు చేశారు. ఇక 50 శాతం వడ్డీ మాఫీ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. నగరపాలక మేనేజర్ చిన్నరాముడు నగరంలోని ఇతర సచివాలయాల్లోని పన్ను వసూళ్ల కేంద్రాలను పరిశీలించారు. వంద శాతం పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి పాటుపడాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారి

కర్నూలు: ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయా స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, నేర చరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులను స్టేషన్లకు రప్పించి నేర ప్రవృత్తికి స్వస్తి పలికి గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, పోలీస్ ఆదేశాలను లెక్క చేయకుండా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పలుమార్లు కౌన్సెలింగ్‌కు హాజరు కాని రౌడీషీటర్ల వివరాలతో పాటు జీవనోపాధికి వారు చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ముస్లింల నిరసన

కర్నూలు (టౌన్): గతంలో ఏన్నడూ లేని విధంగా సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌లో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేయనున్నట్లు కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వెల్లడించారు. ఆయన ఆదివారం సాయంత్రం మాట్లాడుతూ.. వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ముస్లింలు చేతికి ఒకవైపు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేయాలన్నారు. అందరం ఐకమత్యంతో శాంతియుతంగా నిరసన చేద్దామని పిలుపునిచ్చారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): రంజాన్ మాసం పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద నిర్వహించిన ఇఫ్తారు విందులో కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలతో కలిసి దువా చేశారు. అనంతరం విందులో పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది సంబరాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. కృష్ణ బృందంచే నాదస్వర కచేరి, వేద పండితులు భానుస్వామిచే పంచాంగ శ్రవణం చేశారు. ప్రముఖ కథా రచయిత ఇనాయతుల్లా బృందంచే నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం ప్రత్యేకంగా నిలిచింది. నృత్య గురువు కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన సంగీత కచేరి, నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన తొమ్మిది ప్రముఖులు విద్యా రంగంలో జి.పుల్లయ్య, పద్య నాటకంలో పి.దస్తగిరి, సంగీతంలో గీతాంజలి, సాహిత్యంలో జంధ్యాల రఘుబాబు, నృత్యంలో పి.మీనాసాయి, జర్నలిజంలో మండిరాజు శ్రీనివాసరాజు, హరికథలో మంజుల, చిత్రలేఖనంలో దాసరి వెంకట రమణ, వాస్తులో యం.వినీలాకు ఉగాది పురస్కారాలను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ప్రదానం చేశారు. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్‌మియ్యా, సభ్యులు దస్తగిరి, కృష్ణఫర్, యాగంటీశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.